

## కలెక్టర్‌కు గవర్నర్‌చే సత్కారం

ప్రజాశక్తి - ఏలూరు



కలెక్టర్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న గవర్నర్

సాయుధ దళాల పతాక దినోత్సవ నేపథ్యంలో జిల్లా సైనిక సంక్షేమాధికారిగా ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అత్యధిక నిధిని సమకూర్చడం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. విజయవాడ రాజ్‌భవన్ లో శుక్రవారం సాయుధ దళాల జెండా దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను గవర్నర్ సత్కరించారు. అనంతరం కలెక్టర్ హోం శాఖామంత్రి తానేటి వనిత అభినందించారు.

# గ్రామీణ పేదల సమస్యలే ఎజెండాగా..

# చర్చలు.. సమీక్షలు



వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జాతీయ, రాష్ట్ర నేతలు, ప్రముఖులు

- జెండావిష్కరణతో రెండో రోజు వ్యకాస 29వ రాష్ట్రమహాసభ ప్రారంభం
- సంఘం చరిత్రపై పాటూరి రామయ్య రాసిన పుస్తకావిష్కరణ
- గ్రామాల్లో సంఘం బలోపేతంపై దృష్టి పెట్టాలి: విజయరాఘవన్
- సమరశీల పోరాటాలతోనే మార్పు తథ్యమని దిశానిర్దేశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జంగారెడ్డిగూడెం

గ్రామీణ పేదల సమస్యలే ఎజెండా.. వారి బతుకుల్లో తాత్కాలిక, శాశ్వత మార్పునకు చేయాల్సిన ఉద్యమ కార్యాచరణపై చర్చోపచర్చలతో వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ రెండోరోజు శుక్రవారం సాగింది. జంగారెడ్డిగూడెం శివార్లలో దండమూడి రామలక్ష్మి కల్యాణ మండపంలో సంఘ పతాకావిష్కరణతో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. తొలుత సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్ఎ పాటూరి రామయ్య జెండావిష్కరణ చేశారు. అనంతరం పుచ్చలపల్లి సుందరయ్య, మల్లు స్వరాజ్యం, శంకరన్, శ్రీరామ్మూర్తి, అన్నే వెంకటేశ్వరరావు, అనూసయమ్మ తదితర అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ప్రతినిధుల సభ ప్రారంభమైంది. తొలుత ఆహ్వాన సంఘం అధ్యక్షులు షేక్ సాబ్జీ అధ్యక్షోపన్యాసం చేశారు. సభకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు విజయ రాఘవన్ మాట్లాడుతూ 29వ మహాసభలో చర్చించాల్సిన అంశాలు, భవిష్యత్తులో ముందుకు సాగాల్సిన విషయాలపై దిశానిర్ధేశం చేశారు. గ్రామీణ ప్రజలతో అంతా మమేకమై వారి సమస్యలపై పోరాడాలని, ఈ మహాసభలో దానిపైనే ప్రధానంగా చర్చించాలని సూచించారు. ఢిల్లీలో రైతుల పోరాటమే మనందరికీ స్ఫూర్తి అని అన్నారు. పేదల సమస్యలు, వేతనాలపై చర్చించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు తీవ్ర నష్టం కల్గిస్తున్నాయన్నారు. దీంతో కార్మికులు గ్రామాలను వదిలి పట్టణాలకు వలసపోతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామాల్లో నిరుద్యోగం పెరుగుతుందని తెలిపారు. రాజకీయాల్లో ధనప్రభావం పెరిగిపోయిందని, అవినీతి సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ఒక్కో అసెంబ్లీ స్థానంలో ఎన్నికల్లో రూ.200 కోట్లు నుంచి రూ.300 కోట్లు వరకూ ఖర్చు పెడుతున్నారన్నారు. కుల ప్రభావం సైతం పెరిగిపోయిందన్నారు. అనంతరం సీనియర్ నేత పాటూరి రామయ్య రాసిన 'ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమ చరిత్ర' పుస్తకాన్ని విజయరాఘవన్ ఆవిష్కరించారు. అనంతరం ఆహ్వానసంఘం ఉపాధ్యక్షులు దండమూడి ప్రసాద్, మాజీ ఎంఎల్‌ఎసి, బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు జల్లి విల్సన్, ఆహ్వానసంఘం గౌరవాధ్యక్షులు మేకా ఈశ్వరయ్య, మాజీ ఎంఎల్ఎ, సీనియర్ నాయకులు పాటూరి రామయ్య, వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం నాయకులు సోమయ్య మాట్లాడారు. అనంతరం జిల్లాలవారీగా ప్రతినిధుల చర్చలు సాగాయి. సంఘం కేరళ రాష్ట్ర కార్యదర్శి చంద్రన్ తమ రాష్ట్ర అనుభవాలపై ప్రసంగించారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణపై చర్చలు నడిచాయి. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్, రైతుసంఘం పూర్వపు రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, పూర్వ రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం, నేతలు ఎ.రవి, పిల్లి రామకృష్ణ, జీవరత్నం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

### సంపద సృష్టికర్తలకు అప్పులా

**ఆహ్వాన సంఘం అధ్యక్షులు, ఎంఎల్‌సి షేక్ సాబ్జీ**

సమాజంలో 90 శాతం శ్రమజీవులైన వ్యవసాయ కార్మికులకు నేడు అప్పులు, ఆత్మహత్యలు మిగులుతున్నాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. శుక్రవారం ప్రతినిధుల ప్రారంభ సభలో ఆయన అధ్యక్షోపన్యాసం చేస్తూ పశ్చిమగోదావరి జిల్లాకు అనేక రంగాల్లో ఘనమైన చరిత్ర ఉందన్నారు. జిల్లా విభజన అనంతరం ఏలూరు జిల్లాగా అవతరించాక మరింత ప్రాముఖ్యత పెరిగిందన్నారు. అటువంటి జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ నిర్వహించడం అభినందనీయమన్నారు. మారుతున్న కాలంలో వ్యవసాయ కార్మికులకు రోజువారీ పని దినాలు తగ్గిపోయి సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులకు కనీస కూలి కష్టమైపోతుందన్నారు. భూమి తల్లిని నమ్ముకుని సాగులో ప్రధాన పాత్ర పోషించే వ్యవసాయ కూలీలు గౌరవంగా జీవించేందుకు పోరాటాలే మార్గమని అన్నారు.

### ఎర్రజెండా ఉండగా కార్పొరేట్ ఆటలు సాగవు

**ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ దండమూడి ప్రసాద్**

సమాజంలో వ్యవసాయ రంగాన్ని మోస్తున్నది 70 శాతం ప్రజలు, వ్యవసాయ కార్మికులేనని ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ దండమూడి ప్రసాద్ అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ ప్రారంభ సభలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల స్థితిగతులను మార్చేందుకు ప్రత్యేక కార్పొరేషన్ అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశ సంపద కొద్దిమంది చేతుల్లో ఉందన్నారు. శ్రమించే వారందరికీ సంపద దక్కాలన్నారు. సమాజంలో ఎర్రజెండా ఉన్నంతకాలం కార్పొరేట్ల ఆటలు సాగవని ఆయన అన్నారు. వ్యవసాయ కార్మికుల స్థితిగతులను మార్చుకునేందుకు కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఐక్యం కావడం ఎంతో అవసరమన్నారు.

### ఐక్య పోరాటాలు చేయాలి


**మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్**

శ్రమ జీవులైన వ్యవసాయ కార్మికులకు న్యాయమైన కూలి రేట్లు, సామాజిక న్యాయం కోసం వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ దోహదపడుతుందని మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య గ్రామంలో పుట్టిన వ్యవసాయ కార్మిక సంఘం ఇది. ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు ఒకే సమస్య.. ఒకే ఎజెండాపై పోరాటాలు నిర్వహిస్తున్నాయి. భూమి పంచేందుకు, కూలి పెంచేందుకు రానున్న రోజుల్లో ఐక్యఉద్యమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. వ్యవసాయ కార్మికులు, దళితులు, గిరిజనులు పోరాడి సాధించుకున్న భూసంస్కరణ చట్టం, అటవీ హక్కుల చట్టం, కనీస కూలి చట్టాలను పెట్టుబడిదారీ ప్రభుత్వాలు చెత్తబుట్టలో వేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనేరు రంగారావు భూసిఫార్సులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నవరత్నాల్లో భూపంపిణీ ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. వ్యవసాయ కార్మికుల్లో అత్యధికులు దళితులు, గిరిజనులు ఉన్నారని, వారిని ఏకం చేసేందుకు ఐక్య ఉద్యమాలు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

### దళితులు, గిరిజనుల నిలువుదోపిడీ

**ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు మేకా ఈశ్వరయ్య**

నేటికీ దళితులు, గిరిజనులు నిలువు దోపిడీకి గురవుతున్నారని ప్రముఖ న్యాయవాది, మహాసభ ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు మేకా ఈశ్వరయ్య అన్నారు. ప్రతినిధుల ప్రారంభ సభలో ఆయన మాట్లాడుతూ మెట్టప్రాంతంలో గిరిజనుల మాన, ప్రాణాలు దోచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదిగా తన దృష్టికి వచ్చిన అనేక గిరిజన కేసుల్లో చాలామంది తండ్రి ఎవరో తెలియని దుస్థితిలో ఉన్నారన్నారు. గతంలో తాను కమ్యూనిస్టుగా.. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడిగా పని చేసిన సమయంలో తనపై 300కు పైగా కేసులు నమోదు చేశారని, రెండేళ్లపాటు జైలు జీవితం గడిపానని తెలిపారు. ఆ సమయంలో పోలవరం మండలంలో అన్యాయంగా కేసులు మోపబడి జైలుకు వచ్చిన కూలీలు పదిమందిని చైతన్యపరిచి ఆ మండలంలో వ్యవసాయ కార్మిక సంఘం స్థాపనకు బీజం వేశామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో దోపిడీకి గురవుతున్న వర్గాలు అంబేద్కర్ భావజాలంపై ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం తరపున డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పేరిట కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు.



హాజరైన ప్రతినిధులు

## భూమి కోసం ఉద్యమం..

**వ్యకాస సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ పాటూరి రామయ్య**

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వ్యవసాయ కార్మికులు శాశ్వత ఉపాధి కోసం, భూమి కోసం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ పాటూరి రామయ్య అన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభలో ప్రతినిధుల ప్రారంభ సభ సందర్భంగా సంఘ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలలో అమరవీరులకు నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం వ్యవస్థాపకులు పుచ్చలపల్లి సుందరయ్య, అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లు తెలిపారు. అనంతరం ప్రతినిధుల ప్రారంభ సభలో పాటూరి రామయ్య మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టిన ఉద్యమాలు, పోరాటాల డిమాండ్లను బూర్జువా ప్రభుత్వాలు అవసరం మేరకు సంక్షేమ పథకాల పేరుతో నామమాత్రంగా అమలు చేస్తున్నాయన్నారు. బూర్జువా ప్రభుత్వాల పాలనలో సమాజంలో దారిద్ర్య నిర్మూలన, సమానత్వం సాధ్యం కాదన్నారు. వ్యవసాయ కార్మికుల జీవనోపాధి మెరుగుపడాలంటే వారిని చైతన్యపరిచి భూమి సాధించే వరకు పోరాటాలు చేయాలని అన్నారు. తామంతా వ్యవసాయ కూలీల కోసం అప్పట్లో చేసిన ఉద్యమాలకు వారసత్వ ఉద్యమాలు, పోరాటాలు ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

### సంఘ ఉద్యమ చరిత్ర పుస్తకావిష్కరణ

వ్యవసాయ కార్మిక సంఘం పూర్వ జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ పాటూరు రామయ్య రచించిన 'వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమ చరిత్ర' పుస్తకాన్ని సంఘం జాతీయ అధ్యక్షులు విజయ రాఘవన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల చేతిలో భూమి లేకుండా వారి జీవితాల్లో మార్పు సాధ్యం కాదన్నారు. భూమి కావాలనే నినాదం తీసుకొచ్చింది ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అన్నారు. వ్యవసాయ కార్మికులు, దళితులు, పేదలు అనేక పోరాటాలు చేస్తే పాలక పార్టీలు ఆ సమస్యలు పరిష్కరించకుండా అమ్ముల పొది నుంచి తీసినట్లు సంక్షేమ పథకాల పేరుతో అమలు చేస్తారని ఎద్దేవా చేశారు. బూర్జువా, భూస్వామ్య, పెట్టుబడిదారీ ప్రభుత్వాలు ఉన్నంతకాలం పేదరికం, దారిద్ర్యం రూపుమాపలేమన్నారు. పేదల బతుకుల్లో సంపూర్ణ మార్పు రావాలంటే అది సోషలిజం ద్వారానే సాధ్యమన్నారు. అందుకు ఉద్యమాలు విస్తరించడమే మార్గమన్నారు.



రామయ్య



సోమయ్య



సుబ్బారావు



విల్సన్



ప్రసాద్



ఈశ్వరయ్య

## ఏలూరులో సినీతారల సందడి

**ఘనంగా సౌతిండియా షాపింగ్‌మాల్ ప్రారంభం**




**ఏలూరు అర్బన్:** ఏలూరు నగరంలో సినీతారలు సందడి చేశారు. స్థానిక పత్తేబాద్‌లో డీమార్ట్ పక్కనే నూతనంగా ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌ను శుక్రవారం సినీతారలు అనుపమ పరమేశ్వరన్, పాయల్ రాజ్‌పుత్ ప్రారంభించారు. నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నగర ప్రముఖులు, పెద్దసంఖ్యలో నగర ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో భాగస్వామినైనందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ షోరూమ్‌లో అన్ని వయస్సుల వారి కోసం దుస్తులు అందు బాటులో ఉన్నాయని తెలిపారు. రాబోయే వివాహ, పండుగ సీజన్లకు సంప్రదాయాల ఫ్యాషన్ ఇక్కడ అందుబాటులో ఉందన్నారు. ఇక్కడ కంచి, ధర్మవరం, ఆరణి, ఉప్పాడ, పోచంపల్లి డిజైన్ శారీలు, కోయంబత్తూరు, బెంగళూరు, కేరళకు చెందిన డ్రెస్‌లు, సల్వార్‌సూట్‌లు, లెహంగాస్, కిడ్స్‌వేర్, మెన్స్‌వేర్, ఎత్నిక్ వేర్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో షాపింగ్‌మాల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలి

**ఏలూరు:** పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, విలీన పంచాయతీ కార్మికులకు బకాయి జీతాలు ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబా మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ఐదు నెలల బకాయి హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీసం క్రిస్మస్ పండుగ కన్నా ఇవ్వాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాల్టీల్లో హెల్త్ అలవెన్స్ ఇస్తున్నప్పటికీ మన ఏలూరులో మాత్రం ఇప్పటికీ ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ విలీన పంచాయతీ కార్మికులకు మూడు నెలలు బకాయి జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు.అధికారులు స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పని నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బి.జగన్నాథరావు, ఎ.జాన్‌బాబు, లావేటి కృష్ణ, కారు దుర్గారావు, జార్జి, చిన్నం నాగరాజు, ఎం.గోపి, బి.వెంకటేశ్వరరావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ముంచిన వర్షం.. ఆందోళనలో రైతాంగం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆరుగాలం శ్రమించి, పండించిన వరిపంట చేతికొచ్చే సమయంలో తుపాన్ కారణంగా అక్కరకు రాకుండాపోయిందని మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది రోజులుగా మండలంలో ముమ్మరంగా వరికోతలు, నూర్పిళ్లు సాగుతున్నాయి. మరో పది రోజుల్లో రైతు గట్టెక్కే పరిస్థితుల్లో అకాల తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షం కారణంగా రైతులు బెంబేలెత్తుతున్నారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి తేలికపాటి వర్షపు జల్లులు మండలంలో పడుతూ సాయంత్రానికి తీవ్ర రూపం దాల్చింది. దీంతో రైతులు అరబెట్టిన ధాన్యాన్ని పరదాలు కప్పి కాపాడుకునేందుకు పరుగులు తీశారు. చేలల్లో పనపై ఉన్న పైరును కుప్పలు వేసుకునేందుకు నానాహైరానా పడ్డారు. ఈ ఏడాది అధిక దిగుబడి వచ్చిందని రైతులు ఎంతో ఆనందపడ్డారు. అయితే తుపాన్ దెబ్బకు ఆనందం ఆవిరైపోయింది. దీనికితోడు చలిగాలుల కారణంగా చెరువుల్లోని చేపలకు ఆక్సిజన్ అందక తేలిపోయే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు చెబుతున్నారు. మరో రెండు రోజులు వాతావరణం ఈవిధంగా ఉంటే పంట చేతికి అందే పరిస్థితి ఉండదని లబోదిబోమంటున్నారు.

## నిబంధనల సడలింపుపై ఉన్నతాధికారులకు నివేదిస్తా

**ధాన్యం కొనుగోలు ప్రత్యేకాధికారి విజయరాజు**

ప్రజాశక్తి - భీమడోలు

వాతావరణ మార్పుల నేపథ్యంలో తేమ శాతం నిబంధన సడలించాలనే రైతుల విజ్ఞప్తిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు, ధాన్యం కొనుగోలు మండల ప్రత్యేక అధికారి విజయరాజు తెలిపారు. మండలంలో ధాన్యం కొనుగోళ్లను కల్లాల వద్ద ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భీమడోలు వ్యవసాయాధికారి ఉషారాణి ధాన్యం కొనుగోలు ప్రగతిని ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా ధాన్యాన్ని ఆరబెట్టే అవకాశం తక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో ధాన్యాన్ని తేమశాతంతో నిమిత్తం లేకుండా కొనుగోలు చేసి దాని ఆధారంగా చెల్లింపులు జరపాలని రైతులు కోరుతున్నారన్నారు. కొందరు రైతులు బరకాలు కావాలన్నారన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా నిర్ణయించిన తేమ శాతం ఆధారంగా మాత్రమే మిల్లర్లు కొనుగోలు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భీమడోలు ఎంపిఇఒ ఎం.రూపాదేవి పాల్గొన్నారు.



ఆసుపత్రిలో విద్యార్థినులకు జాయింట్ కలెక్టర్ పరామర్శ

## హాస్టల్ విద్యార్థినులకు అస్వస్థత

**వార్డెన్‌పై సస్పెన్షన్ వేటు : జెసి**

**ల్యాబ్‌కు ఆహార, ఐరన్ టాబ్లెట్ల శాంపిళ్లు**

**నిలకడగా విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి : కలెక్టర్**

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం వార్డెన్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ పి.అరుణబాబు అన్నారు. హాస్టల్‌లో గురువారం రాత్రి అస్వస్థతకు గురైన విద్యార్థినులను ఆయన శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ భోజనం బాగా చిమిడిపోయి, ఉడికి ఉడకన్నట్లుగా ఉందని, అన్ని శాంపిళ్లు తీసుకున్నామని తెలిపారు. విద్యార్థులకు అదనపు తరగతి గదుల అవసరం ఉందని, నాడు-నేడులో నూతన గదుల నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. విద్యార్థినుల అస్వస్థతకు కారణమైన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని, అవసరమైతే క్రిమినల్ చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో ఉన్న విద్యార్థినులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. 18 మంది అస్వస్థతకు గురైనట్లు తేలిందని జెసి చెప్పారు. ఇద్దరు విద్యార్థినులను ఏలూరు తరలించారని, హాస్టల్‌లోనే వైద్య శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు.

### హాస్టల్ వద్ద ఉద్రిక్తత

శుక్రవారం తెల్లవారుజామున టిడిపి, జనసేన నేతలు విద్యార్థినులను పరామర్శించడానికి వెళ్లారు. ఆ సమయంలో అస్వస్థతకు గురైన విద్యార్థినులను ఒక గదిలో ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని ఇక్కడ ఎందుకు ఉంచారని సిబ్బందిని నిలదీశారు. తమకు శ్వాస ఆడటం లేదని, వాంతులవుతూ కాళ్లు చేతులు వణుకుతున్నాయని విద్యార్థినులు చెప్పడంతో నేతలు అవాక్కయ్యారు. వెంటనే వారిని ఆసుపత్రికి తరలించాలని డిమాండ్ చేశారు. జెడ్‌పిటిసి నీరజసుధాకర్ కారులో ఐదుగురు విద్యార్థినులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సమయంలో హాస్టల్ వద్దకు చేరుకున్న వైసిపి నేతలు ఈ ఘటనను రాజకీయం చేయొద్దని అనడంతో టిడిపి, వైసిపి నేతల నడుమ వాగ్వివాదం చోటుచేసుకుంది. చింతలపూడి సిఐ మల్లేశ్వరరావు రంగంలోకి సర్దిచెప్పారు.

### ఐరన్ ట్యాబ్లెట్లను ల్యాబ్‌కు పంపిస్తాం

**జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సునీత**

హాస్టల్‌ను జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సునీత శుక్రవారం సందర్శించారు. స్థానికంగా ఉన్న పాఠశాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఘటనపై ఆరా తీశారు. ఐరన్ ట్యాబ్లెట్లను ల్యాబ్‌కు పంపిస్తామని చెప్పారు.

### విద్యార్థినుల ఆరోగ్యానికి ఎటువంటి ఇబ్బందీ లేదు

**డిఎంహెచ్‌ఒ రవికుమార్**

అస్వస్థతకు గురైన విద్యార్థినుల ఆరోగ్యానికి ఎటువంటి ఇబ్బందీ లేదని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి రవికుమార్ అన్నారు. హాస్టల్, ఆసుపత్రిలో ఉన్న విద్యార్థినులను ఆయన పరామర్శించారు. తీసి సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు.

### విద్యార్థినుల పరిస్థితి నిలకడగా ఉంది: కలెక్టర్

చింతలపూడి వసతి గృహంలోని బాలికల ఆరోగ్య పరిస్థితి నిలకడ గా ఉందని, ఎటువంటి ఆందోళనా చెందనవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ చెప్పారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు బాలికలను ఆయన పరామర్శించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆ హాస్టల్‌లో 18 మంది విద్యార్థినులు గురువారం రాత్రి భోజనం చేసిన అనంతరం కడుపునొప్పి, వాంతులు కారణంగా అస్వస్థతకు గురయ్యారని, వారికి తక్షణమే వెంటనే చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందించారని తెలిపారు. ఇద్దరు మినహా మిగిలిన వారందరికీ చికిత్స అనంతరం వారి ఇంటికి పంపించి వేశారని తెలిపారు.కడుపునొప్పి ఎక్కువగా ఉన్న ఇద్దరినీ ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. వారిద్దరి ఆరోగ్య పరిస్థితి కూడా ప్రస్తుతం నిలకడ గానే ఉందని, అయినప్పటికీ చికిత్స కొనసాగుతుందని తెలిపారు. ఆహార శాంపిళ్లు సేకరించి పరీక్షకు పంపించినట్లు తెలిపారు. ఘటనపై విచారణకు అధికారిని నియమించామని, నివేదిక అందిన వెంటనే ఘటనకు కారకులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు.

### హాస్టల్‌ను సందర్శించిన ఎన్‌సిడి ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ మానస

చింతలపూడి హాస్టల్‌లో విద్యార్థినుల అస్వస్థతకు ఐరన్ ట్యాబ్లెట్స్ కారణం కాదని, అన్ని పాఠశాలల్లో ఐరన్ మాత్రలను యధావిధిగా విద్యార్థులకు ఇవ్వాలని ఎన్‌సిడి ప్రాజెక్ట్ డైరెక్టర్, ఆర్‌బిఎస్‌కె పిఒ డాక్టర్ సిహెచ్.మానస అన్నారు. శుక్రవారం హాస్టల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా బాలికల అనారోగ్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతిగృహంలోని వంటశాలను పరిశీలించారు. ఐరన్ టాబ్లెట్లు వేసుకోని బాలికలు కూడా అస్వస్థతకు గురయ్యారని, బాలికల అనారోగ్యానికి ఐరన్ టాబ్లెట్లు కారణం కాదని అన్నారు.



హాస్టల్లో పరిస్థితులను పరిశీలిస్తున్న ఎన్‌సిడి పీడీ డాక్టర్ సిహెచ్.మానస

## ఆర్‌బికె కేంద్రాల పరిశీలన

**ప్రజాశక్తి - చింతలపూడి**

మండలంలోని రాఘవపురం, యర్రగుంటపల్లి, చింతలపూడిలో ఆర్‌బికె కేంద్రాలను విజిలెన్స్ సబ్ కలెక్టర్ డి.బాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను సమస్యలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. రైతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

**చింతలపూడి :** పట్టణంలో ఆర్‌బికె కేంద్రాలను సివిల్ సప్లై డిఎం మంజుభార్గవి శుక్రవారం పరిశీలించారు. గోనెసంచులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పోతునూరు రైతులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆమె రైస్ మిల్లర్లతో మాట్లాడి ఐదు వేల సంచులను ఏర్పాటు చేశారు. సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

## గణపవరాన్ని పశ్చిమలో కలపాలని వినతి

**ప్రజాశక్తి - గణపవరం**

గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డివిజన్‌లో విలీనం చేయాలని గ్రామస్తులు, టిడిపి, వైసిపి నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. స్థానిక దండు మారమ్మ ఆలయం వద్ద గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించి సంతకాలు సేకరించారు. సమావేశంలో ఎంపిపి దండు వెంకటరామరాజు (అర్ధవరం రాము) మాట్లాడుతూ గణపవరం మండలాన్ని భీమవరం డివిజన్‌లో విలీనం చేసేందుకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో కలపాలని ప్రభుత్వం ఇచ్చిన గెజిటెడ్ ఈ నెల పదో తేదీతో ముగుస్తుందన్నారు. సిఎం ఇచ్చిన హామీ మేరకు గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరిలో కలపడానికి స్థానిక ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు కూడా సంసిద్ధత వ్యక్తం చేశారని చెప్పారు.

## ఘనంగా ఎంఎల్ఎ ఎలిజా పుట్టినరోజు వేడుక

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

గోదావరి వరదల కారణంగా పునరావాస కేంద్రాలకు తరలివచ్చిన పోలవరం నిర్వాసితులు చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజా పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్ అండ్ అర్ శ్రీరామపురం కాలనీలో యూత్ నాయకులు బద్దె ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షులు పెరుమాళ్ళ నరసింహారావు ఆధ్వర్యంలో ఎంఎల్ఎ ఎలిజా పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తాడువాయి ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో గర్భిణులకు, వృద్ధులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ నాయకులు బద్దె కృష్ణ, కాలనీ అధ్యక్షులు గిళ్ల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వీరబ్రహ్మం పాల్గొన్నారు.

**చింతలపూడి :** మండలంలో ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా పుట్టినరోజు వేడుకలు వైసిపి నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైసిపి పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం లిబర్టీ చిల్డ్రన్ హోం అనాధాశ్రమం వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజసుధాకర్, గ్రంథాలయ ఛైర్మన్ మిర్యాల దిలీప్, సిటి మెడికల్ అధినేత దుర్గారావు, వెంపా కృష్ణ, రాజ్ ప్రకాష్ పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిస్థితులపై ఎంపిడిఒ ఆరా

**ప్రజాశక్తి - పెదవేగి**

పెదవేగి మండలంలో ప్రజల ఆరోగ్య పరిస్థితులను ఎంపిడిఒ గంజి రాజ్‌మనోజ్ మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సిని ఎంపిడిఒ రాజ్‌మనోజ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో డెంగీ, మలేరియా, టైఫాయిట్ వంటి వైరల్ ఫీవర్స్ ఉన్నాయా అని వైద్యాధికారులు డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ మాధవి, సిహెచ్‌ఒ రోజ్‌మేరీలను అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్, జనవరి నెలలో చిన్నపిల్లలకు న్యుమోనియా, వృద్ధులకు ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. అటువంటి వ్యాధుల పట్ల వైద్యాధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రిలో రోగులకు మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాలని చెప్పారు. ఆసుపత్రి ముఖద్వారం వైపు ప్రహరీ నిర్మించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

# నేరాలు - ఘోరాలు

## టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

**ప్రజాశక్తి - టి.నరసాపురం**

టిప్పర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఎపిగుంటలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎపిగుంట గ్రామానికి చెందిన కంకిపాటి రాంబాబు (33) గ్రామంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా బొర్రంపాలెం వైపు నుంచి టి.నరసాపురం వెళ్తున్న టిప్పర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రాంబాబును స్థానికులు చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఆటో, బైకు ఢీకొని వృద్ధుడు మృతి

### మరొకరికి గాయాలు

**ప్రజాశక్తి - ముసునూరు**

ఆటో, బైకు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని చిల్లబోయినపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు షేక్ లాల్ సాహెబ్ (68), చిలకబత్తుల కిట్టాలు బైక్‌పై వ్యక్తిగత పనుల నిమిత్తం కాట్రేనిపాడు బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో వచ్చేసరికి కాట్రేనిపాడు నుంచి ఏలూరు వైపు వెళ్తున్న ఆటో, వారి బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న షేక్ లాల్ సాహెబ్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన కిట్టాలును స్థానికులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లాలాసాహెబ్ మృతదేహాన్ని నూజివీడు ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు.

## 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**ప్రజాశక్తి - చాట్రాయి**

మండలంలోని పోలవరం గ్రామంలో ఎస్‌ఇబి అధికారులు చేసిన దాడిలో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఇబి ఎస్ఐ బెల్లంకొండ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... చాట్రాయి నుంచి పోలవరానికి వ్యాన్‌లో రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఇబి అధికారులు దాడి చేశారు. ఈ దాడిలో వ్యాన్‌లో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ కోట సురేష్‌బాబును అదుపులోకి తీసుకున్నారు. బియ్యం విలువ సుమారు రూ.45 వేలు ఉంటుందని తెలిపారు. బియ్యాన్ని, వాహనాన్ని చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎస్ఐ కె.ప్రతాపరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

**ప్రజాశక్తి - దెందులూరు**



క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న పోలీసులు, స్థానికులు

దెందులూరు సమీపంలో కొవ్వలి వంతెన వద్ద శుక్రవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో పలువురు గాయాలపాలయ్యారు. దెందులూరు ఎస్ఐ ఇజ్జాపు వీర్రాజు తెలిపిన వివరాల ప్రకారం... రాజమండ్రి నుంచి విజయవాడ వెళ్తున్న ఆర్‌టిసి డీలక్స్ బస్సు దెందులూరు సమీపంలో కొవ్వలి వంతెన వద్దకు వచ్చేసరికి అదే రోడ్డులో వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో బస్సుకు ఒక పక్క లారీకి రాసుకుంది. దీంతో ఒక పక్క కూర్చున్న ప్రయాణికుల్లో ముగ్గురు గాయాలపాలయ్యారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ వీర్రాజు, తహశీల్దార్ నాంచారయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆర్‌టిసి అధికారులు ప్రయాణికులను వేరే బస్సుల్లో గమ్య స్థానాలకు చేర్చేలా ఏర్పాట్లు చేశారు.



## ముప్పిడి రాజు హత్య కేసు వేగవంతం చేయాలి : కెవిపిఎస్

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**



రాజు తల్లిదండ్రులతో మాట్లాడుతున్న మాల్యాద్రి

మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో గత సంవత్సరం కాలంగా ముప్పిడి రాజు హత్య కేసులో జరుగుతున్న జాప్యం సరికాదని, కేసు వేగవంతం చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. శ్రీనివాసపురం గ్రామంలో ముప్పిడి రాజు తల్లి దండ్రులు మరియమ్మ, యేసులను ఆంద్ర మాల్యాద్రి, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఫ్రాన్సిస్, జొన్నకూటి శ్రీనివాస్ శుక్రవారం కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రి మాట్లాడుతూ ముప్పిడి రాజును హత్య చేసిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాజు పోస్టుమార్టం రిపోర్టును ఇప్పటికీ ఇవ్వకపోవడం కేసును పక్కదారి పట్టించేందుకు వైసిపి నాయకులు ప్రయత్నిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఇప్పటికీ బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సాయం, నష్ట పరిహారం అందలేదని వాపోయారు. బాధితులకు ప్రజా సంఘాలు అండగా ఉంటాయని, ఈ ప్రాంతంలో ఉన్న దళితులు, అభ్యుదయవాదులు, ప్రజా సంఘాల నాయకులు ముప్పిడి రాజు కుటుంబానికి అండగా రావాలని కోరారు. అసలైన నిందితులను అరెస్టు చేసేవరకూ పోరాటం ఉధృతం చేస్తామని చెప్పారు.

## మహిళా చట్టాలపై అవగాహన అవసరం : పెంచల కిషోర్

**ప్రజాశక్తి - ఏలూరు**

లింగ వివక్షత లేని సమాజం మనందరి బాధ్యత అని ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ కె.పెంచల కిషోర్ అన్నారు. లింగ వివక్షతలేని సమాజం కోసం చేపట్టే కార్యక్రమాల్లో భాగంగా స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో మహిళా శిశుసంక్షేమ అభివృద్ధి రీజనల్ ఆర్గనైజర్ వందనపు సాయి బాలపద్మ, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు బూసి వినీత, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు జె.రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఆయన పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ లింగ వివక్షతను సమూలంగా నిర్మూలించేందుకు అందరూ సమిష్టి కృషి చేయాలన్నారు. లింగ వివక్షత నిర్మూలన ఇంటి నుంచే ప్రారంభం కావాలన్నారు. లింగ వివక్షతపై అవగాహన కార్యక్రమాల్లో పురుషులను కూడా భాగస్వాములను చేయాల న్నారు. మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి రీజనల్ ఆర్గనైజర్ వందనపు సాయి బాలపద్మ మాట్లాడుతూ పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళల పట్ల వివక్షత చూప రాదన్నారు. మహిళా సాధికారత కోసం, మహిళలకు, పిల్లలకు సురక్షితమైన వాతావరణాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. సచివాలయాల శాఖ జిల్లా కో-ఆర్డినేటర్ టిఎన్.స్నేహన్ మహిళ అంటే ఎవరు అనే అంశంపై మాట్లాడారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. సీనియర్ అడ్వకేట్ కృష్ణారావు, మహిళా శిశుసంక్షేమ శాఖ పీడీ పద్మావతి పాల్గొన్నారు.

## రైతులే దేశానికి వెన్నెముక : ఎంపీ కోటగిరి శ్రీధర్




మాట్లాడుతున్న ఎంపీ కోటగిరి శ్రీధర్

**టి.నరసాపురం :** దేశానికి అన్నం పెడుతున్న రైతులే దేశానికి వెన్నెముక అని ఏలూరు పార్లమెంటు సభ్యులు కోటగిరి శ్రీధర్ అన్నారు. పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజుతో కలిసి మండలంలోని కె.జగ్గవరం సొసైటీ పరిధిలో ఉన్న గుడ్లపల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్రం నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం రాజుపోతేపల్లి అడ్డరోడ్డులో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకు ఆవరణలో ఏర్పాటు చేసిన స్థల దాతలు రాజారాఘవరాజు సూర్య నారాయణ రాజు, వేణు బాయమ్మ, రైతు విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందుతున్నా యన్నారు. కె.జగ్గవరం సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న పాలక వర్గాన్ని, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు, ఎంపిపి డి.లక్ష్మి, ఛైర్ పర్సన్ వాసిరెడ్డి మధు, పర్సన్స్ వంటిపల్లి వెంకటేశ్వరరావు, కత్తి వెంకటేశ్వరరావు, సర్పంచులు బొంత రమాదేవి అంజిబాబు, తడికలపూడి శివ, మాధవి, కిషోర్ కుమార్, ఎంపిటిసి సభ్యులు బొడ్డపాటి రాంబాబు, సిఇఒ తనగాల వీర వెంకయ్య పాల్గొన్నారు.

## అభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలి : ఎంపిపి

**ప్రజాశక్తి - భీమడోలు**



భీమడోలులో శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి

సమగ్ర భాగస్వామ్యంతో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2023-24 తయారు చేయాలని ఎంపిపి కె.రామయ్య కోరారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయిలో గ్రామ పంచాయతీల అభివృద్ధి అంశంపై నాలుగు విడతలుగా నిర్ణీత సంఖ్యతో ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యంతో కొనసాగే శిక్షణా కార్యక్రమాన్ని ఎంపిపి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి స్థానిక పరిస్థితులు, అవసరాలకు అనువుగా ప్రజల భాగస్వామ్యంతో అందుబాటులో ఉన్న వనరులతో పారదర్శకంగా ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. కార్యక్రమ నిర్వాహకులుగా వ్యవహరించిన ఎంపిడిఒ రాఘవన్ మాట్లాడుతూ శుక్రవారం ముగ్గురు సర్పంచులు, ఐదుగురు ఎంపిటిసి సభ్యులతో కలిపి 76 మంది గ్రామస్థాయి అధికారులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 12వ తేదీన ముగ్గురు సర్పంచులు, తొమ్మిది మంది ఎంపిటిసి సభ్యులతో కలిపి 79 మంది గ్రామ స్థాయి అధికారులకు, 13వ తేదీన నలుగురు సర్పంచులు, ముగ్గురు ఎంపిటిసి సభ్యులతో కలిపి 57 మంది గ్రామస్థాయి అధికారులకు, 14వ తేదీన ముగ్గురు సర్పంచుల పూళ్ల, గుండుగొలను, సూరప్పగూడెం ఎంపిటిసి సభ్యులతో కలిపి 59 గ్రామస్థాయి అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నామన్నారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీలో వీరందరూ భాగస్వాము లుగా ఉంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగా, ఎఎంసి చైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు డి.వాసంతి పాల్గొన్నారు..

**జీలుగుమిల్లి :** గ్రామ పంచాయతీ అభివృద్ధి పథంలో నడవాలంటే ప్రణాళికలు సరైన రీతిలో ఉండేటట్లు చూసుకోవాలని డిఎల్‌పిఒ ఎస్ఎస్.నగేష్ అన్నారు. జీలుగుమిల్లి ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. గ్రామల్లో పారిశుధ్య నిర్వహణపైనే ప్రజల ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. వీధులను, డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చి బ్లీచింగ్ చల్లాలని తెలిపారు. అనంతరం తాటియాకుల గూడెంలోని చెత్త సంప ద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి చెత్తను, సంపద తయారీ కేంద్రాలకు తర లించి కంపోస్టుగా మార్చి పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపి డిఒ కె.మంగతాయారు, పంచాయతీ కార్యదర్శులు సుబ్రహ్మ ణ్యం, దేవప్రియుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

**ప్రజాశక్తి - ముసునూరు**

ఇంటి స్థలం లేని నిరుపేదలందరికీ స్థలం ఇవ్వాలన్నదే వైసిపి ప్రభుత్వం ఉద్దేశమని ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, తహశీల్దార్ దాసరి సుధ అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామ ప్రజలకు ఇంటి స్థలాలపై మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నూతనంగా లబ్ధిదారులకు సేకరించిన జగనన్న కాలనీ ఇళ్ల స్థలాలను పరిశీలించారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**ప్రజాశక్తి - బుట్టాయగూడెం**

రోడ్డు ప్రమాదాల నివారణకు ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని ఎస్ఐ జయబాబు సూచించారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రైవింగ్ చేసే సమయాల్లో సంబంధిత పత్రాలు కలిగి ఉండాలని, ట్రాక్టర్‌పై ఓవర్ లోడ్ ఉండరాదని చెప్పారు. కొంత మంది ట్రాక్టర్లకు సౌండ్ బాక్సులను ఉపయోగించటం వల్ల వెనుక వచ్చేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు.

## నాణ్యమైన పొగాకును పండించాలి

**ప్రజాశక్తి - కొయ్యలగూడెం**

నాణ్యమైన పొగాకును పండించేందుకు ప్రతి రైతు కృషి చేయాలని వేలం నిర్వహణ అధికారి గ్రేస్ మార్గరెట్ అన్నారు. మండలంలోని దిప్పకాయలపాడు గ్రామంలో పొగాకు రైతులకు శుక్రవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామంలో రైతుల వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. పురుగు మందుల అవశేషాలు లేకుండా చూడాలని, తెగుళ్ల నివారణలో తాము సూచించే మందులను మాత్రమే వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ వై.ప్రశాంతి పాల్గొన్నారు.

## రైతులు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి - కొయ్యలగూడెం**

మాండోస్ తుపాన్ నేపథ్యంలో ప్రభుత్వం రక్షణ చర్యలు తీసుకుందని తహశీల్దార్ పాశం నాగమణి తెలిపారు. మండల వ్యవసాయ అధికారి చెన్నకేశవులతో కలిసి గవరవరం పొంగుటూరు గ్రామాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. రైతులకు తుపానుపై అప్రమత్తత కల్పిస్తూ పండిన పంటను రక్షించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసేవరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

## కొట్టాడలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

**ప్రజాశక్తి - కైకలూరు రూరల్**

మండలంలోని కొట్టాడలో శుక్రవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డీ సాధికార కమిటీ అధ్యక్షులు బలే ఏసురాజు, ఎంపిటిసి మాజీ సభ్యులు సైదు రాంబాబు, సైదు కామేష్ పాల్గొన్నారు.

## 'ఫ్యామిలీ డాక్టర్'తో ప్రజలకు చేరువలో వైద్య సేవలు

**ప్రజాశక్తి - ఏలూరు టౌన్**

ఫ్యామిలీ డాక్టర్ విధానానికి ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తుందని చాటపర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దావీదు చెప్పారు. శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా చాటపర్రు పిహెచ్‌సి పరిధిలోని తంగెళ్లమూడి పంచాయతీ కంద్రికగూడెం-1 సచివాలయంలో వైద్య శిబిరం నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దావీదు మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని వారికి ఇంటి వద్దే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లలేని వారికి, నిరుపేదలకు ఫ్యామిలీ డాక్టర్ విధానం ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కోసం ప్రతి పిహెచ్‌సిలో ప్రభుత్వం ఇద్దరు డాక్టర్లను నియమించిందన్నారు. 104 మెబైల్ యూనిట్ తో సహా సిబ్బంది డాక్టర్ తోపాటు ఆశావర్కర్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. చాటపర్రు పిహెచ్‌సి పరిధిలో 19 సచివాలయాల్లో టూర్ షెడ్యూలు ప్రకారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఒపి అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, పాలు, గుడ్లు, పంపిణీ తీరును వాకబు చేశారు. పలువురు గర్భిణులు, బాలింతలు, ఆరోగ్యశ్రీ వైద్యం అనంతరం ఇంటిదగ్గర ఉన్న రోగుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొనేందుకు ఆయా గృహాలను వైద్య బృందం సందర్శించింది.

## రాఘవరెడ్డికి పలువురి అభినందన

**ప్రజాశక్తి - చాట్రాయి**

మండలంలోని బూరుగుగూడెం గ్రామానికి చెందిన ఎఎంసి మాజీ ఛైర్మన్, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు, వైసిపి సీనియర్ నేత దేశిరెడ్డి రాఘవరెడ్డి రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ చాట్రాయి మండలాన్ని వైసిపికి కంచుకోటలాగా మలచారన్నారు. రాఘవరెడ్డి రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్‌గా నియమితులవ్వడం సంతోషకరమన్నారు. నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్న సమయంలో చాట్రాయి మండలానికి వచ్చినప్పుడు రాఘవరెడ్డికి ఒక ఉన్నతమైన పదవిని ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం రాఘవరెడ్డికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు కలిగిన పదవిని ఇచ్చి మాట నిలుపుకున్నారన్నారు. దేశిరెడ్డి రాఘవరెడ్డి మాట్లాడుతూ ఈ పదవి నాకు రావటానికి ముఖ్యమంత్రితో మాట్లాడి కృషి చేసిన ఎంఎల్ఎ వెంకట ప్రతాప్ అప్పారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అభినందన సభకు వచ్చిన ప్రతిఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా సహకార బ్యాంక్ అధ్యక్షులు తన్నీరు నాగేశ్వరరావు, ఎంపిపి లంక నిర్మల, చింతలపూడి ఎఎంసి ఛైర్మన్ జానకిరెడ్డి పాల్గొన్నారు.

## సత్యసాయి సేవా సమితి సేవలు అభినందనీయం

**ప్రజాశక్తి - కైకలూరు రూరల్**

శ్రీ సత్యసాయి సేవా సమితి సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. మండలంలోని సీతనపల్లిలో శుక్రవారం వివిధ పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన గర్భిణులకు సమితి ఆధ్వర్యంలో భోజనాలు పెట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యులు హేమలత, అన్నపూర్ణ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీ సత్యసాయి సేవాసమితి కైకలూరు వారు ప్రతి నెలా ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నారు. సీతనపల్లి వంటి మారుమూల అల్పాహారం కూడా దొరకని ప్రాంతంలో భోజన సదుపాయం కల్పించడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా వంద మందికి పైగా భోజనం చేస్తున్నారు. ఈ కార్యక్రమం కొనసాగేందుకు సమితి కన్వీనర్ వీరప్ప, జోనల్ ఇన్‌ఛార్జి కృష్ణమోహన్, యూత్ ఆర్గనైజర్ సాయికృష్ణ కషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, అనురాధ, విజయలక్ష్మి, ఆసుపత్రి సిబ్బంది మూర్తి, శ్రీనివాస్, పద్మరాజు, తేరాజమ్మ, రఫీ ఆరోగ్య కార్యకర్తలు, సిహెచ్‌ఒలు పాల్గొన్నారు.

## నర్సింగ్ కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పన

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

స్థానిక పత్తేబాదలోని రెడ్ క్రాస్ ఎఎన్ఎం నర్సింగ్ మహిళా కళాశాలను ఆ కళాశాల ఛైర్‌పర్సన్ బొమ్మిరెడ్డి పద్మజా వాణి, కమిటీ సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తగా చేరిన విద్యార్థినులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పద్మజారాణి మాట్లాడుతూ ఇటీవల కళాశాల హాస్టల్లోని విద్యార్థినులకు మంచాలు సరిపోవడం లేదని తెలిసి, పది డబుల్ స్టేర్ ఇనుప మంచాలను ఏర్పాటు చేశామన్నారు. ఇంకా కొన్ని సదుపాయాలను త్వరలోనే దాతల సహకారంతో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ నెల 15వ తేదీన సెమీ క్రిస్మస్ చేస్తున్నామని, ఆ రోజున విద్యార్థినులకు పెన్నులు, నోట్ బుక్స్, పేస్టులు, బ్రష్లు, సబ్బులు, కొబ్బరి నూనె డబ్బాలతో కూడిన హైజన్ కిట్లను కూడా పంపిణీ చేయనున్నా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వై.డెబోరా, కమిటీ సభ్యులు వై.ఉమావాణి, డాక్టర్ జి.నవ్య కళ, ఆర్.కమల, బి.జ్యోతి, అధ్యాపకురాలు జి.జ్ఞానవేని, అనూష, ఎ.ప్రియాంక పాల్గొన్నారు.

## పలుచోట్ల 'కాఫీ విత్ క్లాప్ మిత్రాస్'

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను పూర్తిస్థాయిలో స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని డిఎల్‌పిఒ ఎస్ఎస్.నగేష్ అన్నారు. మండలంలోని తాటియాకులగూడెం గ్రామ పంచాయతీ సంపద తయారీ కేంద్రం వద్ద శుక్రవారం నిర్వహించిన కాఫీ విత్ క్లాప్ మిత్రాస్ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.మంగతాయారుతో కలిసి ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని హరిత రాయబారులతో అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు కలిసి క్లాప్ మిత్రాలతో కాఫీ తాగడం ద్వారా ఒక మంచి ఆహ్లాద అనుభూతి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మంగతాయా రు, సర్పంచి వనమా రాంబాబు, కార్యదర్శులు వీరలక్ష్మి దేవప్రియుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఉంగుటూరు :** తిమ్మయ్యపాలెం గ్రామ పంచాయతీలో శుక్రవారం స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగంగా శుక్రవారం కాఫీ విత్ క్లాప్ మిత్రాస్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా గ్రామాలను సుందరంగా తీర్చి దిద్దాలని సూచించారు. ఎంపిడిఒ ఎస్.ప్రేమాన్విత మాట్లాడుతూ తడి, పొడి చెత్త వేర్వేరు చేసి ఇవ్వడంపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. సర్పంచి సింహాద్రి శ్రీదేవి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికి ఉచితంగా రెండు డస్ట్‌బిన్‌లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు పుత్సకాయల విష్ణుమూర్తి పాల్గొన్నారు.

## నిర్వాసితుల వివాద భూములపై విచారణ

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

మండలంలోని పి.అంకంపాలెం పంచాయతీ పి.నారాయణపురంలో నిర్వాసితులకు కేటాయించిన భూముల్లో భూమికి భూమి కేటాయింపులో అన్యాయం జరిగిందని పి.నర్సారెడ్డి స్పందనలో ఫిర్యాదు చేయగా శుక్రవారం ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ సూర్యనారాయణరెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించారు. రికార్డ్ వెరిఫికేషన్ అనంతరం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయనతో పాటు తహశీల్దార్ గెడ్డం ఎలీషా, విఆర్‌ఒ తులసి, సర్వేయర్లు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్ఆర్ పేటలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో 30 మంది బ్యాంకు ఉద్యోగులు రక్తదానం చేశారని ఆ సొసైటీ జిల్లా ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా నూకల లక్ష్మణ్ హాజరై మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ హెడ్ బి.శ్రీరామమూర్తి, బ్రాంచ్ మేనేజర్ ఎన్.శ్రీనివాస్, ఆపరేషన్ హెడ్ ఎ.సత్యనారాయణ, రెడ్ క్రాస్ పిఆర్‌ఒ కెవి.రమణ, ఎన్.విజయ పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోవాలి

**ప్రజాశక్తి - ఏలూరు టౌన్**

ధాన్యం కొనుగోలులో రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి.ప్రసాద్ కోరారు. స్థానిక స్ఫూర్తి భవనంలో ఏలూరు జిల్లా రైతు సంఘం విస్తృతస్థాయి సమావేశం రైతు సంఘం రాష్ట్ర నాయకులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవివి ప్రసాద్ మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి ప్రభుత్వం సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం 1061 ధాన్యాన్ని ప్రస్తుతం గ్రేడ్ ఎక్కువగా పరిగణిస్తుందని, యధావిధిగా గ్రేడ్ 1 ధాన్యంగా పరిగణించాలని డిమాండ్ చేశారు.

## సింగరాయపాలెంలో నేడు అన్నసమారాధన

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మండలంలోని సింగరాయపాలెం శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి కళ్యాణ మహోత్సవాల ముగింపు సందర్భగా శనివారం మహా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ శొంఠి నాగరాజు శుక్రవారం తెలిపారు. ఉదయం పది గంటలకు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నసమారాధన కార్యక్రమం ప్రారంభిస్తారన్నారు. ఈ సమారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు. అన్న సమారాధనకు సంబంధించిన ఏర్పాట్లను ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ వైసిపి నాయకులతో కలిసి పరిశీలించారు.

**మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**E.P.No. 24/2022 in O.S.No. 312/2021**

**D.H.R /Plaintiff:** Annamreddi Subbarao
**J.D.R /Defendant:** Boddu Nethiyya

***TO:***
Boddu Nethiyya, S/o. Ramulu, Opp: Sub Station, Pakasaraopalem, TPG JCJC

పై నెంబరు ఇ.పి.లో జె.డి.ఆర్.కు సేల్ నోటీసు ఎన్నిసార్లు పంపినను సదరు ఇ.పి. సంగతులు తెలిసియుండి సదరు నోటీసు తీసుకొనకుండా Evade చేయుచున్నందున Substituted Service ద్వారా అమలు జరుపుటకు ఉత్తర్వులు ఇచ్చి **ది.30-12-2022కి వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు వాయిదా రో జున ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు పై నెంబరు ఇ.పి. తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

**KASULURI SIVA RAMA KRISHNA**
Advocate for D.H.R.,
Tadepalligudem, Tadepalligudem.
06-12-22. Cell: 99490 76266

**మహారాజశ్రీ పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**ఇ.పి.నెం. 30/2019**
**ఓ.ఎస్.నెం. 61/2015**

***బిట్వీన్:***
పల్లెల వరహాలరావు ...డి.హెచ్.ఆర్
అండ్
మరీదు వెంకటేశ్వరరావు ...జె.డి.ఆర్

పై నెంబరు గ్రంధములో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం జె.డి.ఆర్.కు చెందిన ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని పై కోర్టు వారి ఎదుట **ది.30-12-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥ల లగాయతు బహిరంగంగా వేలం వేయుదురు.** కావున కావలసిన వారు తమ యొక్క ఒరిజినల్ ఐడెంటిటీ కార్డులతో హాజరవగలరు.

**షెడ్యూలు ఆస్థి వివరం**

ప॥గో॥జిల్లా, వట్లూరు ఎస్.ఆర్.ఓ., వట్లూరు పంచాయితీ మరియు గ్రామం, పెదపాడు మండలం, రి॥స॥నెం. 677/6 మరియు 672/1లో గల య.2-10 సెంట్లు మెరక భూమికి హద్దులు:
***తూర్పు:*** దేవుడి మాన్యం భూమి.
***దక్షిణం:*** కె.వెంకట రత్నం గారి భూమి.
***పడమర:*** పంటబోదె.
***ఉత్తరం:*** తాళం బుల్లియ్య గారి భూమి.

ఈ హద్దుల మధ్య 1/3వ వంతు అవిభక్త వాటా య.2-10 సెంట్లులో జె.డి.ఆర్.కు చెందినది.

**DHR Value of Property : Rs.6,00,000/-**
**Ameena Value : Rs.5,00,000/- Per Acre**

**డి.వి.అప్పారావు,**
న్యాయవాది, ఏలూరు.
సెల్: 94401 11079